
జమ్మిగడ్డ ముత్యాలమ్మ ఆలయం వద్ద పరమేశ్వర్‌రెడ్డి


మారుతీనగర్ కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి


కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే బండారి


మల్లాపూర్ అశోక్‌నగర్‌లో బోనాలతో మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు

బోనమెత్తిన భక్తజనం

బోనాలు సమర్పించి.. మొక్కులు చెల్లించి..


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు


బోనంతో మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ కుటుంబసభ్యులు


కట్టమైసమ్మ దేవాలయం వద్ద కార్పొరేటర్ శ్రవణ్

బోడుప్పల్ : బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆదివారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ సతీమణి స్పందన, వారి సోదరి డాక్టర్ సరిత అమ్మవారికి బోనాలు సమర్పించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

◆ గ్రామ దేవతల దయ ప్రజలపై ఉండాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ బంగారు మైసమ్మ ఆలయంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

మల్కాజిగిరి : మల్కాజిగిరిలోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం, బాలసరస్వతీనగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం, ఆర్‌కేనగర్‌లోని బందరు మైసమ్మ దేవాలయం, సఫిల్‌గూడలోని విజయదుర్గ దేవాలయం వద్ద భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, గౌతంనగర్ కార్పొరేటర్ సునీతా యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

చర్లపల్లి, మీర్‌పేట, హెచ్‌బీకాలనీ డివిజన్ల పరిధిలో..

కుషాయిగూడ: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం చర్లపల్లి, మీర్‌పేట–హెచ్‌బీకాలనీ డివిజన్ల పరిధిలో భక్తి శ్రద్ధలతో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

నాచారం డివిజన్‌లో..

మల్లాపూర్ : నాచారం డివిజన్‌లోని పలు ఆలయాల్లో నిర్వహించిన బోనాల వేడుకలకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, చంద్రమౌళి, రాజిరెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సావర్కర్‌నగర్, ఇందిరానగర్‌లో...

నాచారం సావర్కర్‌నగర్, ఇందిరానగర్‌లోని పోచమ్మ దేవాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కాప్రా : ఏఎస్‌రావునగర్, కాప్రా డివిజన్లలో తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలో నిలబడి బోనాలు సమర్పించుకున్నారు. జమ్మిగడ్డ ముత్యాలమ్మ ఆలయానికి కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుల పరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్, కాంగ్రెస్ నేతలు కొత్త అంజిరెడ్డి తదితరులున్నారు.

బోనమెత్తిన కార్పొరేటర్..

ఉప్పల్ : చిలుకానగర్ డివిజన్‌లో నిర్వహించిన బోనాల సందర్భంగా స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు బన్నాల గీతప్రవీణ్ ముదిరాజ్ కుటుంబసమేతంగా వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నేతలు, స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు....

మల్లాపూర్ : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో నిర్వహించిన బోనాల వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. నాచారం ఇందిరానగర్ పోచమ్మ దేవాలయంలో నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నాచారం మహంకాళి దేవాలయంలో కాంగ్రెస్ నేత పరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అశోక్‌నగర్ పోచమ్మ దేవాలయంలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు సంపత్‌గౌడ్, నర్సింహా, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, స్టార్‌రెడ్డి, రాంచందర్, రఘు, శ్రీనివాస్, దత్తు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు


బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో మేయర్


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దంపతులు


నాచారంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్


అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు


హెచ్‌బీకాలనీలో ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్


సావర్కర్‌నగర్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తదితరులు


బోనంతో చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత

నూతన కార్యవర్గం


శ్రీసాయి బృందావన్ కాలనీ నూతన కార్యవర్గం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ బొల్లారం శ్రీసాయి బృందావన్ కాలనీ నూతన కార్యవర్గాన్ని నియమించారు. కమిటీ అధ్యక్షులుగా మాచిరాజు జోగిరాజు, ఉపాధ్యక్షులుగా రాజేంద్రరెడ్డి, శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీగా రాఘవశర్మ, శ్రీనివాస్, ట్రెజరర్‌గా రఘుపతిరెడ్డి నియమితులయ్యారు.

ఆకట్టుకున్న నృత్య సోయగం


ఉప్పల్ మినీ శిల్పారామంలో సభాభివందనం చేస్తున్న కళాకారులు

ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డాక్టర్ భాగవతుల సేతురాం శిష్యబృందంచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మోదమున, సూర్యాష్టకం, జతిస్వరం, శ్రీనగర రూపిణి, మీనాక్షి, పంచరత్న, వినరో భాగ్యము, కృష్ణ జనన శబ్దం, తిల్లాన, సరస్వతి స్తుతి తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. హాజరైన ప్రముఖులు కళాకారులను ఆశీర్వదించారు.

3న కాలనీవాసుల సమావేశం


సమావేశంలో న్యూభవానీనగర్ కాలనీవాసులు

మల్లాపూర్ : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ భవానీనగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కాలనీ ప్లాట్ల ఇళ్ల స్థలాలు, మైసమ్మ దేవాలయ విషయాలపై చర్చించారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోదండ ధర్మారెడ్డి, ఎండీ ఇస్మాయిల్ మాట్లాడారు.. 40 ఏళ్ల క్రితం న్యూ భవానీనగర్ కాలనీ ఏర్పడిందని చాలా మధ్యతరగతి వారు ప్లాట్లను కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారన్నారు. కొంతమంది న్యూ భవానీనగర్ కాలనీ మాదని కోర్టులో కేసు వేశారన్నారు. కోర్టు తీర్పు కాలనీలో నివసిస్తున్న వారికి అనుకూలంగా వచ్చిందని వివరించారు. ఆగస్టు 3న ఆర్డీ ఆఫీసుకి వెళ్లాల్సి ఉందని, తాము నివసిస్తున్న ప్లాట్ల విషయంలో కేసు పెట్టిన వారిపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలన్నారు. కాలనీలో ఉన్న దేవాలయాన్ని కాలనీ అసోసియేషన్‌కు అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు. ముత్యంరెడ్డి, శ్రీశైలం, జానకీరాం, జమ్మన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

ఉప్పల్ : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఫుట్‌పాత్‌లు ఆక్రమించినా, వ్యాపార సంస్థలు రోడ్డుపైకి వచ్చేలా షెడ్డులు నిర్మిస్తే కూల్చివేస్తామని మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ ఎంవీ. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి తొలగించారు. ఈ నిర్మాణాల తొలగింపుతో ఉప్పల్ ట్రాఫిక్ సమస్యకు కొంతమేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగినా, కాలినడకన బాటసారులకు ఇబ్బంది కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని వివరించారు. ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి, సూర్యనాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

700 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

మేడిపల్లి : నిర్మానుష్య ప్రదేశంలో నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ అక్షయ్‌నగర్ కాలనీకి చెందిన చర్ల సంపత్ కుమార్ (21) గత కొంతకాలంగా గంజాయిని ఖమ్మం జిల్లా నుంచి అక్రమంగా కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లల్లో పెట్టి పలువురికి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు ఆదివారం స్థానికంగా ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో గంజాయిని విక్రయిస్తుండగా.. దాడిచేసి సంపత్‌ను అదుపులోకి తీసుకున్నారు. సుమారుగా 700 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని చందుపట్లగూడకు చెందిన పంజాల సందీప్ (30), కొత్తగూడకు చెందిన బాలబోయిన శ్రీశైలం (40) రెండు బెల్టు షాపులలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఇరువురు వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో పోలీసులు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో మహిళపై..

పోచారం: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న మహిళపై పోచారం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సమాచారం మేరకు... అన్నోజిగూడలోని ఎల్ఎస్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నానావత్ వినోద (38) మద్యం విక్రయిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులకు తనిఖీలు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, ఆమెపై కేసు నమోదు చేశారు.

ఓటుతోనే సమానత్వ భావన


అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ఎస్ఐ సైదులు తదితరులు

ఘట్‌కేసర్: సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానమే అనే భావనను ఓటు హక్కు మనకు గుర్తు చేస్తుందని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సైదులు అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని సైదులు స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ పేరు తెచ్చుకుందన్నారు. అంబేడ్కర్ అభిమాన సంఘాల ప్రతినిధులు మేకల దాస్, సంజీవ్ గౌడ్, ఆమడ బలరాజ్, బండారి రాందాస్, నర్సింగరావు, ఇరిటం శ్రీనివాస్, మీసాల రాజేష్, సుధాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘భోగ్–భండార్’


భోగ్–భండార్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నేత వేముల మహేష్

ఘట్‌కేసర్: ఘణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పకీర్ టిక్యా తండాలో ఉన్న జగదాంబాదేవి సహిత సేవాలాల్ మహరాజ్ ఆయలంలో జెండాపూజ సందర్భంగా ఆదివారం భోగ్–భండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ పాల్గొని అమ్మవారితో పాటు సేవాలాల్ మహరాజ్‌ను దర్శించుకొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నానావత్ రూప్‌సింగ్ నాయక్, తండా నాయక్ వడ్త్యా రాజు నాయక్, కారోబారి నానావత్ హుస్సేన్, రమావత్ అమర్‌సింగ్, గుగులోత్ సుమన్, తండా ప్రజలు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం..

పంచాయతీ భవనం అధ్వానం




డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ భవనం

లక్షలాది రూపాయాల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం నిర్వహణ లోపంతో అధ్వాన స్థితికి చేరుకుంటోంది. పంచాయతీ భవనాన్ని రెండంతస్తులలో అందంగా నిర్మించారు. సర్పంచ్‌లు ఉన్నన్ని రోజులు బాగానే నిర్వహించినా వారి పదవీ కాలం ముగియడంతో నిర్వహణ అటకెక్కింది. దీంతో సదరు భవనం పైకి బాగానే కనిపిస్తున్నా లోపల అందవికారంగా.. అధ్వానంగా తయారవుతోంది. మొదటి, రెండు అంతస్తుల్లోని గోడలకు పెచ్చులు ఊడిపోవడం, రంగులు ఊడిపోతున్నాయి. వర్షపు నీరు గోడల్లోకి ఇంకి నిమ్మెత్తుతున్నాయి. దీంతో గోడలు ఎప్పుడు పచ్చిగా ఉంటున్నాయి. చిన్నచిన్న మరమ్మతులు చేసి భవనం పటిష్టతను, అందాన్ని కాపాడితే బాగుంటుదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

– మేడ్చల్


డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ భవనంలో ఊడిపోయిన పెచ్చులు

నిధుల కేటాయింపుపై హర్షం

లాలాపేట: బ్రాహ్మణ సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 50 కోట్లు నిధులు కేటాయించడంపై బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర నూతన అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ సంక్షేమానికి బ్రాహ్మణ పరిషత్ ద్వారా పథకాలను మరింత విస్తరించాలన్నారు. ఆదివారం లాలాపేటలోని శివాంజనేయ దేవాలయం ఆవరణలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రఘుకిరణాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా రాజేశ్వర శర్మ, పతంజలి శర్మ, ముఖ్య ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శిగా అభిషేక్ శర్మ ఎన్నికయ్యారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

అడ్డగుట్ట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. అమ్ముగూడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో సుమారు 50–55 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో కాలుజారి ప్లాట్‌ఫాం, రైలు మధ్యలో ఇరుక్కుపోవడంతో రెండు కాళ్లు విరిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

మరోఘటనలో....

పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. మల్కాజ్‌గిరి – లాలాగూడ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మహిళ పట్టాలు దాటుతుంది. ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.